నమస్తే తెలంగాణ
ఖమ్మం
5 | ఖమ్మం, మంగళవారం 1 అక్టోబర్ 2024 | KHAMMAM

గతమెంతో ఘనంగా..

కర్షకుల కష్టాలు తెలిసిన గత ముఖ్యమంత్రి కేసీఆర్.. వాటిని కడతేర్చేందుకు విశ్వ యవనికలో ఎక్కడా లేని అద్భుత పథకాలను తీసుకొచ్చారు. రైతుబంధుతో రైతును రారాజు చేశారు. జూన్‌తో ప్రారంభమయ్యే వానకాలం సీజన్ కోసం మే నెలలోనే పెట్టుబడి సాయాన్ని రైతుల ఖాతాల్లో జమ చేసేవారు. యాసంగి సాయాన్ని నవంబర్‌లోనే అందించేవారు. తొలుత ఎకరానికి రూ.8 వేలతో ప్రారంభించిన ఈ పంటల పెట్టుబడి సాయాన్ని తరువాత రూ.10 వేలకు పెంచారు. ఆ సాయాన్ని అందుకున్న రైతులు సాగును సంబురంగా చేసుకునే వారు. కానీ నేడు అదే సాగుదారుల్లో సంబురమే లేకపోయింది.

గత కేసీఆర్ సర్కారు అందించిన రైతుబంధు పంటల పెట్టుబడి సాయాన్ని చూపిస్తూ మురిసిపోతున్న రైతు (ఫైల్)

కేసీఆర్ ఉన్నప్పుడు ఏ తిప్పలూ లేవు

రైతులకు ఏ ఇబ్బందులు రాకుండా ముందే ఆలోచన చేసిన నాయకుడు కేసీఆర్. పంటల సాగు కోసం ఆయన పాలనలో ఏనాడూ ఇంత ఇబ్బంది పడలేదు. నాకు ఐదు ఎకరాల సాగు భూమి ఉంది. రైతు భరోసా రాలేదు. దీని గురించి ప్రభుత్వం ఒక్కమాట కూడా చెప్పడం లేదు. రేపటితో యాసంగి మొదలవుతుంది. ఇప్పుడు రెండు సీజన్‌లవి కలిపి ఇస్తారో లేక ఒక్క సీజన్‌వే ఇస్తారో చూడాలి. గతంలో రూ.2 లక్షల పంట రుణం తీసుకున్నాను. బ్యాంకు వాళ్లు ఒత్తిడి తెస్తే రూ.90 వేలు కట్టాను. కానీ ఇంతవరకు నా పంట రుణం మాఫీ కాలేదు. **–కొమ్మినేని నర్సింహారావు, రైతు, కొణిజర్ల**

- నేటితో ముగిసిన 'వాన కాలం' వ్యవసాయ సీజన్
- కానీ.. నేటికీ అందని 'పంటల పెట్టుబడి సాయం'
- మళ్లీ అప్పులు తెచ్చి పంటలు సాగుచేసిన అన్నదాతలు
- కేసీఆర్ ప్రభుత్వంలో ఠంచనుగా అందిన 'రైతుబంధు'
- గత కేసీఆర్ పాలనను గుర్తుకు తెచ్చుకుంటున్న అన్నదాతలు

'భరోసా' ఏమాయె?

కళ్లలో ఒత్తులేసుకొని కోటి ఆశలతో ఎదురుచూసిన కర్షకులను కనీస కనికరం లేకుండా నిలువునా వంచించింది కాంగ్రెస్ ప్రభుత్వం. రైతుభరోసా నుంచి మొదలుకొని రుణమాఫీ దాకా అన్నింటా దగా చేసింది. చివరికి సీజన్ ముగిసినా చిల్లిగవ్వ కూడా చేతికి అందించలేదు. రోజుల తరబడి ఎదురుచూసిన రైతులు మళ్లీ షావుకార్ల దగ్గరకు వెళ్లి పంటల పెట్టుబడి కోసం వడ్డీకి డబ్బులు తెచ్చుకున్నారు. సీజన్ ముగిసే నాటికి రైతుభరోసా అందించినా నాలుగు నెలల వడ్డీ కలిపి సేటుకు చెల్లించేద్దామనుకున్నారు. కానీ కాంగ్రెస్ సర్కారు చేసిన మోసంతో తలలు పట్టుకొని పాలంలో కూర్చుంటున్న దయనీయ దృశ్యాలు ఉమ్మడి జిల్లాలో కలిచివేస్తున్నాయి. గత ప్రభుత్వంలో ఠంచనుగా అందిన రైతుబంధుతో రాజసాన్ని పొందిన రైతులందరూ.. నేడు పంటల సాయం కోసం రేయింబవళ్లూ ఎదురుచూస్తున్నారు. గత కేసీఆర్ పాలనలో సీజన్‌కు ముందుగానే అందిన పెట్టుబడి సాయంతో సాగు సరంజామా నంతా ముందే సిద్ధం చేసుకొని ఉన్న సంగతులను మననం చేసుకుంటున్నారు. కేసీఆర్ తమ వెంట లేని లోటు స్పష్టంగా కన్పిస్తోందంటూ సహచర సాగుదారులతో సంభాషిస్తున్నారు. –ఖమ్మం, నమస్తే తెలంగాణ ప్రతినిధి/ భద్రాద్రి కొత్తగూడెం, నమస్తే తెలంగాణ, సెప్టెంబర్ 30

కేసీఆర్ ఉన్నప్పుడు ఇలా జరగలేదు

కేసీఆర్ సీఎంగా ఉన్నంతకాలం ఏ ఒక్క రైతూ ఇబ్బంది పడలేదు. ముఖ్యంగా రైతుబంధు సాయం మాత్రం అస్సలు ఆగలేదు. వానకాలం సీజన్ వచ్చిందంటే చాలు.. జూన్ జూలై నెలల్లోనే పంటల సాయం అందేది. దీంతో ముందుగానే మందుకట్టలు తెచ్చిపెట్టుకునే వాళ్లం. కానీ ఈ సంవత్సరం నాలుగు నెలలు గడిచినా ఇంత వరకు రైతుబంధు సాయం అందలేదు. కేసీఆర్‌కంటే ఎక్కువే ఇస్తామంటూ చెప్పిన కాంగ్రెసోళ్లు ఇప్పుడు అసలుకే మోసం చేశారు.
–రేగళ్ల అప్పయ్య, రైతు, ముత్తగూడెం

రైతు భరోసా ఊసే లేదు..

నాకు ఐదెకరాల సాగు భూమి ఉంది. గత వర్షాకాలం తొలకరిలో పెట్టుబడి కోసం గత సీఎం కేసీఆర్ సహాయం చేశారు. యాసంగి సాగుకు రెండో దఫా కూడా సరైన సమయంలో పెట్టుబడి సహాయం అందేది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతు భరోసా, రుణమాఫీ అని చెప్పినా వాటి ఊసే లేదు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం రైతు రుణమాఫీ, రైతు భరోసా అమలు చేసి రైతులను ఆదుకోవాలి.
–బానోత్ వాలునాయక్, రైతు, మొక్కంపాడుతండా

ఆశలు వదులుకున్నా..

ఇప్పటివరకు రైతు భరోసా రాలేదు. వానకాలం సీజన్ అయిపోయింది. ఇంకెప్పుడిస్తారు? ముందుగా వేసిన వరి పంట మరో 20 రోజుల్లో కోతకు వస్తుంది. నాకు రుణమాఫీ కూడా కాలేదు. సీఎం రేవంత్‌రెడ్డి మాటలపై నమ్మకం పోయింది. మాకైతే రైతు భరోసా రాలేదు. రుణమాఫీ కాలేదు. కాంగ్రెస్ ప్రభుత్వంపై ఆశలు వదులుకున్నాం. ఎన్నికల ముందు ఎన్నో ఆశలు కల్పించి ఇప్పుడు నిరాశపరచడం ఎంతవరకూ సబబు?
–మొడియం రాముడు, రైతు, అశ్వారావుపేట

కేసీఆర్ పాలనలోనే మేలు..

గత కేసీఆర్ పాలనలో వ్యవసాయం స్వర్ణయుగం. ఆయన పాలనే బాగుంది. రైతుకు ఏడాదికి రూ.10 వేల చొప్పున రెండు దఫాలుగా రైతుబంధు వేశారు. ఆ పంటల సాయంతో వ్యవసాయాన్ని పండుగలా చేసే వాళ్లం. కానీ కాంగ్రెస్ వచ్చిన తర్వాత రైతు నడిరోడ్డుపై నిలబడ్డాడు. మొదటి విడత రైతుబంధు ఇంకా వెయ్యలేదు. యాసంగి పంట కూడా మొదలు కాబోతున్నది. ప్రభుత్వ పథకాల కోసం అధికారుల చుట్టూ తిరగాల్సి వస్తోంది.
–కొండా రాము, రైతు, సున్నంబట్టి గ్రామం

'కాలం' ముగిసినా.. 'సాయం' జాడలేదు..

అనేక రైతు సంక్షేమ పథకాలకు కొర్రీలు పెట్టుకుంటూ వస్తున్న కాంగ్రెస్ సర్కారు.. రైతుభరోసా పథకంలో కూడా వానకాలం సీజన్‌కు రాంరాం చెప్పినట్లుగానే కన్పిస్తోంది. వానకాలం సీజన్ ప్రారంభానికి ముందే అందాల్సిన పంటల పట్టుబడి సాయం ఇంకా అందనేలేదు. అన్నదాతల ఎదురుచూపులతోనే కాలం గడిచిపోయింది. సరిగ్గా నేటితో వానకాలం సీజనే ముగిసిపోయింది. అంటే దాదాపు నాలుగు నెలలపాటు 'అదిగో.. ఇదిగో..' అంటూ కాంగ్రెస్ పాలకులు కాలయాపన చేశారు తప్ప కర్షకులు అప్పులకు పోకుండా పంటల పెట్టుబడి అందించలేదు.

ఈ వానకాలం సీజన్‌లో ఖమ్మం జిల్లా రైతులు 4.40 లక్షల ఎకరాల్లో వివిధ రకాల పంటలు వేశారు. ఇప్పటికే పెసర పంట చేతికొచ్చింది. మార్కెట్లో విక్రయానికీ వెళ్తోంది. మరో వారం పది రోజుల్లో వరి, పత్తి పంటలు కూడా చేతికి రానున్నాయి. జూన్‌లో మొదలయ్యే వానకాలం సీజన్.. సెప్టెంబర్‌తో ముగుస్తుంది. అక్టోబర్‌తో ప్రారంభమయ్యే యాసంగి సీజన్ జనవరి, ఫిబ్రవరి నెలల్లో పూర్తవుతుంది. అయితే, ఎకరానికి రూ.15 వేలు ఇస్తామంటూ గొప్పలు చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం వానకాలం సీజన్ ముగిసిపోయినా నేటికీ నయాపైసా జమచేయలేదు.

మళ్లీ వడ్డీ వ్యాపారుల వద్దకు..

కాంగ్రెస్ సర్కారు కాలయాపనతో వేసారిన రైతులు మళ్లీ వడ్డీ వ్యాపారుల తలుపు తడుతున్నారు. అప్పులు దొరకని రైతులు కొందరు తమ పంట చేలను బీడుగా వదిలేయగా.. తక్కువ పెట్టుబడి దొరికిన మరికొందరు రైతులు పంట విస్తీర్ణాన్ని తగ్గించారు. ఇదే సమయంలో వచ్చిన వర్షాలు, వరదలు వారిని మరోసారి దెబ్బతీశాయి. ఇప్పుడు మొదలయ్యే యాసంగికి కూడా రైతు భరోసా అందకపోతే ఇంకోసారి కూడా అప్పులతోనే సాగుకు సన్నద్ధం కావాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. ఖమ్మం జిల్లాలో ప్రతి వానకాలం సీజన్‌లో 3.10 లక్షల మంది రైతులకు గాను సుమారు రూ.350 కోట్ల మేర రైతుబంధు నిధులు అందేవి. రెండు సీజన్లకు కలిపి ఇంచుమించుగా రూ.550 కోట్ల నిధులు రైతుల ఖాతాల్లో జమ అయ్యేవి. కానీ నేడు నయాపైసా లేదు.

గత కేసీఆర్ ప్రభుత్వంలో రైతుబంధు సాయం అందిన వేళ ఆనందంతో సాగులోకి దిగిన అన్నదాత (ఫైల్)

భరోసా అందలేదు.. మాఫీ కాలేదు..

రైతుభరోసాకు అందించాల్సిన నిధులను రైతు రుణమాఫీకి మళ్లించిన కాంగ్రెస్ ప్రభుత్వం.. దానినీ సక్రమంగా పూర్తిచేయలేదు. లెక్కనేనన్ని కొర్రీలతో అనేకమందికి ఎగనామం పెట్టింది. దీంతో ఇటు రైతుభరోసా అందక.. అటు రుణమాఫీ కాక కర్షకులందరూ కష్టాలకు ఎదురీదుతున్నారు. గొప్పలు చెప్పిన రుణమాఫీ కూడా సగంమంది రైతులకు కాలేదు. ఉదాహరణకు ఖమ్మం డీసీసీబీని పరిశీలించినా ఈ విషయం స్పష్టమవుతోంది. ఇక్కడ రూ.2 లక్షల్లోపు రుణాలు కలిగిన రైతులు 1.69 లక్షల మంది ఉన్నారు. కాగా, వారిలో కేవలం 65 లక్షల మంది రైతుల రుణాలు మాత్రమే మాఫీ అయ్యాయి. అంటే ఇంకా లక్ష మందికిపైగా రుణమాఫీ కావాల్సి ఉంది.

'భద్రాద్రి'లో 4.77 లక్షల ఎకరాలు..

భద్రాద్రి జిల్లాలో 4,77,538 ఎకరాల్లో అన్నదాతలు వివిధ పంటలను సాగుచేస్తున్నారు. వీటిల్లో ఏ ఒక్క ఎకరానికి కూడా ఈ సీజన్‌లో రైతుభరోసా పంటల పెట్టుబడి సాయం అందలేదు. గత కేసీఆర్ ప్రభుత్వంలో ఈ జిల్లాలో 1,20,163 మంది సాధారణ రైతులతోపాటు 22,036 మంది పోడు రైతులకు కలిపి రూ.213 కోట్లకు పైగా రైతుబంధు సాయం అందేది. దీంతో ఇక్కడ ఏటికేడు సాగు విస్తీర్ణం పెరిగేది. ఇప్పుడా జాడే లేకుండాపోయింది. ఇక యాసంగి యాక్షన్ ప్లాన్ ఊసు కూడా కన్పించడం లేదు.

రైతుబంధు వేయకుండా మోసం..

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇప్పటివరకు రైతుబంధు వేయకుండా రైతులను మోసం చేసిండు. రైతుబంధు పడితే పంట పెట్టుబడికి పనికొచ్చేది. కానీ.. గత కేసీఆర్ ప్రభుత్వం రైతులను రాజులా చూసింది. వ్యవసాయాన్ని పండుగలా చేసింది. కానీ ఈ కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను తిప్పించుకుంటూ కాలయాపన చేస్తోంది. ఇప్పటి వరకు రైతుబంధు వేయకపోతే వ్యవసాయం ఎలా చేసేది? ప్రభుత్వం మేల్కొని ఖాతాల్లో రైతుబంధు వేయాలి.
–దుర్గారావు, రైతు, కేశవపట్నం

నట్టేట ముంచిన కాంగ్రెస్ ప్రభుత్వం..

ఎన్నికల ముందు ఎన్నో హామీలు ఇచ్చిన కాంగ్రెస్.. ఎన్నికల తర్వాత ప్రభుత్వంలోకి వచ్చి రైతులను నట్టేట ముంచింది. సోమవారంతో వానకాలం సీజన్ ముగిసింది. పంట పెట్టుబడికి ముందుగానే ఇవ్వాల్సిన రైతుబంధు పంట అయిపోయే దశకు వచ్చినా ఇవ్వలేదు. వానకాలం కూడా అయిపోయింది. రైతు పెట్టుబడి సాయాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పట్లో ఇచ్చేలా లేదు. పెట్టుబడి సాయం లేక ఎంతోమంది చిన్న, సన్నకారు రైతులు అప్పుల పాలయ్యారు.
–దొడ్డపునేని శ్రీదేవి, మహిళా రైతు, కొత్తకారాయిగూడెం

వ్యవసాయానికి ఎంతో ఇబ్బంది..

గత ముఖ్యమంత్రి కేసీఆర్ రైతులకు ఎన్నో విధాల సహాయ సహకారాలు అందించారు. రైతును రాజుగా చేసేందుకు ఎనలేని కృషి చేశారు. అన్నదాతలను అన్ని విధాలా ఆదుకున్నారు. రైతుబంధు, రైతుబీమా అందించారు. కానీ.. ప్రస్తుత ప్రభుత్వం విత్తనాలు, ఎరువులు, కరెంట్ సహా అని విషయాల్లో ఇబ్బంది పెడుతున్నది. అదిగో ఇదిగో పెట్టుబడి సాయం అంటూ కాలం వెళ్లదీస్తున్నది. వానకాలం కాస్తా అయిపోయింది. రైతులను ఏం చేయాలనుకుంటున్నారు?
–చెక్కిలాల లక్ష్మణరావు, రైతు, ఉప్పలచెలక

కాలం ముగిసినా 'భరోసా' ఏది?

వానకాలం ముగిసినా పంటల పెట్టుబడి సాయాన్ని కాంగ్రెస్ సర్కారు అందించలేదు. రైతు భరోసాపై మంత్రులు ఎవరికి తోచినట్లుగా వారు మాట్లాడుతున్నారు. రేవంత్‌రెడ్డి సర్కారు రైతు భరోసా పథకాన్ని అటకెక్కించింది. వానకాలం ఆరంభంలోనే రైతు భరోసా పథకాన్ని అమలు చేస్తామని గొప్పలు చెప్పిన ప్రభుత్వం.. ఇప్పటి వరకూ దాని ఊసు ఎత్తడం లేదు. రైతులను మోసం చేసిన ప్రభుత్వానికి రాబోయే రోజుల్లో గుణపాఠం తప్పదు.
–యక్కంటి కృష్ణారెడ్డి, రైతు, ఏడూళ్లబయ్యారం

ఎదురు చూడడమే పని అయ్యింది..

రైతుబంధు కోసం ఎన్నో రోజులుగా ఎదురు చూస్తున్నా. అదిగో వేస్తాం.. ఇదిగో వేస్తాం అని చెప్పినప్పుడల్లా ఎదురు చూడడమే మా వంతు అయ్యింది. కానీ.. సీజన్ పోయినా కూడా ఇంతవరకు మా ఖాతాల్లో డబ్బులు వేయలేదు. గత ముఖ్యమంత్రి కేసీఆర్ పంటకు ముందే రైతుబంధు ఇచ్చి అన్ని విధాల కృషి చేశారు. పెట్టుబడి కోసం ఇప్పుడు పడుతున్న ఇబ్బందులు ఎన్నడూ పడలేదు.
–వెలివెల కృష్ణయ్య, రైతు, పెనుబల్లి

పెట్టుబడికి అప్పు చేశాం..

వానకాలం పంట చేతికొచ్చే సమయానికి కూడా రైతు భరోసా రాకపాయే. అప్పు తెచ్చి సాగు చేయాల్సి వచ్చింది. రైతు భరోసా వస్తుందో రాదో తెలియదు. పంటలకు పెట్టుబడికి సాయం అందక ఇబ్బందులు పడుతున్నాం. గత కేసీఆర్ ప్రభుత్వంలో సాగుకు ముందుగానే రైతుబంధు వచ్చింది. అప్పుడు పెట్టుబడి భారం లేకపాయే. కాంగ్రెస్ ప్రభుత్వం రైతు భరోసా అందించి ఆదుకోవాలి.
–వీరబోయిన మోహనరావు, రైతు, మర్రిగూడెం

ప్రతి విద్యార్థీ కంప్యూటర్‌పై పట్టు సాధించాలి

భద్రాద్రి కొత్తగూడెం కలెక్టర్ జితేశ్ వి పాటిల్

పాల్వంచ రూరల్, సెప్టెంబర్ 30 : ప్రతి విద్యార్థి కంప్యూటర్ వినియోగంపై అవగాహన పెంచుకోవాలని, ఇందుకోసం ఉపాధ్యాయులు వారికి చిన్నతనం నుంచే మెళకువలు నేర్పించాలని కలెక్టర్ జితేశ్ వి పాటిల్ సూచించారు. జగన్నాథపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సోమవారం టీఎన్ఆర్ ట్రస్ట్ ద్వారా అందించిన కంప్యూటర్ తరగతి గదిని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావుతో కలిసి కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దాతలు అందించిన కంప్యూటర్లను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలన్నారు. కంప్యూటర్ వినియోగంలో ఏమైనా సందేహాలుంటే నిష్ణాతులైన ఉపాధ్యాయులు నివృత్తి చేయాలన్నారు. విద్యాభివృద్ధికి తాండ్ర నారాయణరావు ట్రస్ట్ అందిస్తున్న సేవలను ఎమ్మెల్యే కూనంనేని కొనియాడారు. అనంతరం పాఠశాల ప్రాంగణంలో ఔషధ మొక్కలు నాటారు. కార్యక్రమంలో డీఈవో వెంకటేశ్వరాచారి, తహసీల్దార్ వివేక్, ఎంపీడీవో విజయభాస్కర్‌రెడ్డి, ఎంఈవో శ్రీరామ్మూర్తి, టీఎన్ఆర్ ట్రస్టు సభ్యులు నవీన్, నరాటి ప్రసాద్, సీపీఐ నాయకులు సాబీర్‌పాషా తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల ప్రాంగణంలో ఔషధ మొక్కల గురించి వివరిస్తున్న కలెక్టర్ జితేశ్ వి పాటిల్

ఆలస్యమైనా.. ఆనందం లేదు

- డీఎస్సీ-2008 అభ్యర్థుల పరిస్థితి ఇది..
- సర్టిఫికెట్ల పరిశీలనకు 25 శాతమే హాజరు
- 'కాంట్రాక్ట్' అనడంతో ఆసక్తి చూపని అభ్యర్థులు
- మైదాన ప్రాంతంలో 128కి 71 మంది హాజరు
- ఏజెన్సీ ఏరియాలో 215కి గాను 18 మందే..

సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ప్రక్రియను పరిశీలిస్తున్న విద్యాశాఖ అధికారులు

ఖమ్మం ఎడ్యుకేషన్, సెప్టెంబర్ 30: ఉద్యోగాలు వచ్చాయన్న ఆనందం వారిలో లేనే లేదు.. కొలువులో చేరాలా.. వద్దా అనే మీమాంసలో ఉన్నారు.. సర్కార్ కొలువే లక్ష్యంగా చదివి 2008 డీఎస్సీలో ఎంపికై ఉద్యోగం దక్కించుకోలేకపోయిన అభ్యర్థులు అనేక పోరాటాలు చేస్తూ వస్తున్నారు. ఈ తరుణంలో గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో డీఎస్సీ 2008 అభ్యర్థులకు ఉద్యోగాలు కల్పిస్తామని కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చింది. ఇప్పుడు మాటమార్చి కాంట్రాక్ట్ పద్ధతిలో తీసుకుంటామని నిబంధనలు పెట్టడంతో వారి ఆశలు ఆవిరైపోయాయి. ఆలస్యమైనప్పటికీ ప్రభుత్వ ఉద్యోగం దక్కుతుందన్న ఆనందం వారికి లేకుండాపోయింది. పాత డీఈవో కార్యాలయం వేదికగా సోమవారం నిర్వహించిన సర్టిఫికెట్ల పరిశీలన ప్రక్రియకు అభ్యర్థులు అంతంతమాత్రం హాజరుకావడమే ఇందుకు నిదర్శనం.

ఆసక్తి చూపలేదు..

డీఎస్సీ 2008లో ఎంపికైన అభ్యర్థులకు ఉద్యోగాలిస్తున్నామని కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన ప్రకటన పట్ల అభ్యర్థులు ఆసక్తి చూపలేదు. నిరుత్సాహపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగుల జీవితాలతో ఆడుకుంటున్నదని, చెప్పిందొకటి.. చేసిందొకటి అంటూ డీఎస్సీ అభ్యర్థులు ఆగ్రహం వ్యక్తంచేశారు. కాంట్రాక్ట్ పద్ధతిలో ఎస్‌జీటీ(సెకండరీ గ్రేడ్ టీచర్)గా నియమిస్తామని పేర్కొనడంతో ఆశలు సన్నగిల్లి ఆందోళన మొదలైంది. మైదాన ప్రాంతం, ఏజెన్సీ ప్రాంతాల వారీగా ధ్రువపత్రాల పరిశీలనకు అభ్యర్థులను రావాలని సూచించినా 25శాతం మంది మాత్రమే హాజరయ్యారంటే ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాల పట్ల ఉన్న వ్యతిరేకత అర్థమవుతున్నది. చాలా మంది డీఎస్సీ 2008 ఉద్యోగం కంటే ప్రస్తుతం తాము చేస్తున్న ఉద్యోగాలే ఉత్తమం అనే పరిస్థితి ఉంది. ఇప్పటివరకు వారికి ఇచ్చే జీతభత్యాలకు సంబంధించిన పూర్తి నిబంధనలు సైతం ప్రకటించకపోవడం కూడా అభ్యర్థులు ఆసక్తి చూపకపోవడానికి కారణం.

343 మందికి 89మంది హాజరు..

విద్యాఖాధికారులు ఐదుగురు గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులతో ఐదు టీమ్‌లుగా ఏర్పాటు చేసి డీఎస్సీ 2008 సర్టిఫికెట్ల పరిశీలన చేశారు. అత్యధిక మంది అభ్యర్థులు వస్తారనే ఆలోచనతో ఉదయం 9:30 గంటలకే పాత డీఈవో కార్యాలయం వద్దకు చేరుకున్నారు. ఏజెన్సీ ప్రాంత అభ్యర్థుల కోసం మూడు టీమ్‌లు, మైదాన(ప్రాంత వారికి రెండు టీమ్‌లు కేటాయించారు. సమయం మధ్యాహ్నం 12గంటలవుతున్నా ఏజెన్సీ ప్రాంత అభ్యర్థుల కోసం ఎదురుచూడటం తప్ప సర్టిఫికెట్ల పరిశీలన జరగలేదు. మైదాన ప్రాంతంలో 128 మందికి 71 మంది హాజరుకాగా, ఏజెన్సీ ప్రాంతంలో 215మందికి 18 మంది మాత్రమే హాజరయ్యారు. డీఈవో సోమశేఖరశర్మ, సూపరింటెండెంట్ శ్రీధర్ ప్రక్రియను పర్యవేక్షించారు. అభ్యర్థులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు.

కాంట్రాక్ట్ పద్ధతి బాధాకరం..

చాలా సంవత్సరాల నుంచి ఉద్యోగం కోసం ఎదురుచూస్తున్నాం. అప్పటి డీఎస్సీలో నష్టపోయాం, ఇన్ని సంవత్సరాల తర్వాత అయినా రెగ్యులర్ పోస్టు ఇస్తే బాగుండేది. ఉద్యోగం పొందేందుకు చాలా పోరాటాలు చేశాం. ఇప్పుడు కాంట్రాక్ట్ పద్ధతిన ఇస్తుండడం చాలా బాధాకరం.
–అభిలాష్, డీఎస్సీ 2008 అభ్యర్థి

సర్వీస్ నష్టపోయాం..

డీఎస్సీ 2008లో ఉద్యోగం రాకపోవడం వల్ల సర్వీస్ నష్టపోయాం. 16 సంవత్సరాల తర్వాత ఇస్తున్న ఉద్యోగమైనా కాంట్రాక్ట్ కాకుండా రెగ్యులర్‌గా ఇస్తే చాలా సంతోషంగా ఉండేవాళ్లం. కాంగ్రెస్ ప్రభుత్వ నిర్ణయం చాలా బాధగా ఉంది. ఇన్నేళ్లు ఎదురుచూసినా ఫలితం లేదు.
–బీ.కవిత, డీఎస్సీ 2008 అభ్యర్థిని

తాగునీటి కోసం మహిళల నిరసన

వానకాలంలోనూ తాగునీటి కోసం గిరిజన గ్రామాల ప్రజలు తంట్లాడుతున్నారు. మూడు రోజులుగా మిషన్ భగీరథ నీరు రాకపోవడంతో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా టేకులపల్లి మండలం కోయగూడెం గ్రామంలోని పలు కాలనీల వాసులు అవస్థలు పడుతున్నారు. ఖాళీ బిందెలు పట్టుకొని చేతి పంపు వద్దకు చేరుకున్న గిరిజన మహిళలు సోమవారం నిరసన తెలిపారు. తాగునీరు అందించేందుకు గ్రామంలో రెండు వాటర్ ట్యాంకులు ఉండడంతో పంచాయతీ సిబ్బంది ప్రతిరోజూ నీటిని వదులుతున్నా.. కొన్ని వీధులకు మూడు రోజులుగా నీళ్లు రావడం లేదని తెలిపారు. గ్రామంలోని ప్రాథమిక పాఠశాల సమీపంలోనే నీటి ట్యాంకు ఉన్నా.. పంపులు రాకపోవడంతో చేతి పంపులను ఆశ్రయించాల్సి వస్తోందని పలువురు గిరిజన మహిళలు ఆరోపించారు. పంచాయతీ అధికారులు ప్రత్యేక దృష్టి సారించి ప్రతిరోజూ పంపు నీళ్లు వచ్చే విధంగా చూడాలని కోరారు. –టేకులపల్లి, సెప్టెంబర్ 30

'నమస్తే తెలంగాణ'లో ప్రచురితమైన కథనం

మ్యూజియం ప్రారంభోత్సవానికి..
అనుమతివ్వండి

'నమస్తే' కథనానికి స్పందన

ఖమ్మం ఎడ్యుకేషన్, సెప్టెంబర్ 30: విద్యార్థులకు ప్రయోగాత్మకంగా పాఠాలు బోధించేందుకు, సైన్స్‌పై మక్కువ పెంచేందుకు ఖమ్మం నగరంలో ఏర్పాటు చేసిన సైన్స్ మ్యూజియం ప్రారంభోత్సవ అనుమతి కోసం ఫైల్ సిద్ధమైంది. 'నమస్తే తెలంగాణ'లో సోమవారం 'మ్యూజియానికి మోక్షమెప్పుడో?' అనే శీర్షికన కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. దీనిపై స్పందించిన డీఈవో సోమశేఖర శర్మ ప్రారంభానికి అవసరమైన అనుమతుల కోసం ఫైల్‌ను సిద్ధం చేశారు. ఈ వారంలో మ్యూజియం ప్రారంభోత్సవానికి అనుమతి ఇవ్వాలని ఫైల్‌ను కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్‌కు పంపించారు.